
సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 2 । మార్చి । 2023



శ్రీవారి నిత్యాన్నదాన విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు వంగల వెంకట్రావు (భీమవరం), రూ.1,01,116, బలుసు పుల్లయ్య(జోగన్నపాలెం) రూ. 1,01,116 బుధవారం విరాళంగా అందజేశారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 7.20అడుగుల నీటిమట్టం ఉంది.

పాదగయ హుండీ లెక్కింపు



పిఠాపురం: పిఠాపురం పాద గయ క్షేత్రంలో 43 రోజుల హుండీ ఆదాయం రూ. 15,02,769 సమకూరినట్లు ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. బుధవారం హుండీలను తెరిచి లెక్కించామన్నారు.

భారతమాలకు రహదారాలు

- నాలుగు వరుసలుగా మూడు జాతీయ రహదారులు
- పారిశ్రామిక ప్రగతికి దిక్సూచి
- అవుటర్ రింగ్ రోడ్డు మాదిరి ఫ్లై ఓవర్‌లు
- వేగం పుంజుకున్న భూ సేకరణ
- యుద్ధ ప్రాతిపదికన పనులు
- రెండేళ్లలో పూర్తి చేయాలనే సంకల్పం
- కాకినాడ తీరంతో ఉమ్మడి తూర్పు అనుసంధానం



కాకినాడ రూరల్ కొత్తూరు వద్ద ఏడీబీ రహదారి విస్తరణ పనులు

సాక్షిప్రతినిధి, కాకినాడ: భారతమాల ప్రాజెక్టు వేగం పుంజుకుంది. గడువులోగా దీనిని పూర్తి చేయాలనే సంకల్పంతో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి దోహదపడేలా రూపొందించిన ఈ ప్రాజెక్టుల కోసం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధానంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు, తొండంగి సమీపాన గేట్‌వే ఆఫ్ పోర్టు కాకినాడను ఒకపక్క విశాఖపట్నం, మరోపక్క ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలను అనుసంధానించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు మూడు జాతీయ రహదారులను భారతమాల ప్రాజెక్టు కింద నాలుగు వరుసలుగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఒకటి లేదా, రెండేళ్లలో పనులను పూర్తి చేయాలని జాతీయ రహదారుల సంస్థ గట్టిగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా భూ సేకరణ, టెండర్ల ఖరారు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

వడివడిగా ..

కాకినాడ అచ్చంపేట జంక్షన్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకు 13.20 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి అందుబాటులోకి రానుంది. ఏడాది వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేయాలనే సంకల్పంతో పనుల వేగం పెంచారు. ఇక్కడ భూసేకరణ అవసరం లేకుండానే ఉన్న రోడ్డునే నాలుగు లేన్లుగా ఆధునీకరిస్తున్నారు. టెండర్లు ఖరారు కావడంతో రూ.90 కోట్ల అంచనాతో పనులు కూడా మొదలయ్యాయి. ప్రస్తుత రోడ్డును ఇరువైపులా వెడల్పు చేస్తూ నాలుగు వరుసలుగా చేపట్టడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

చకచకా భూసేకరణ

ఉమ్మడి తూర్పులో పారిశ్రామికాభ్యున్నతికి సామర్లకోట-అచ్చంపేట జాతీయ రహదారి బాటలు వేయనుంది. రూ.395.60 కోట్ల అంచనాతో 12.25 కిలోమీటర్ల మేర ఈ జాతీయ రహదారి కోసం 33 ఎకరాల ప్రైవేటు భూమి, 21 ఎకరాల ప్రభుత్వ భూమి అవసరమవుతోంది. ఇందుకు నోటిఫికేషన్ కూడా విడుదలైంది. ఈ హైవేలో సగం గ్రీన్‌ఫీల్డ్ (పొలాల మధ్య) ఉంటుంది. కాకినాడ-పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ వద్ద ప్రారంభమై ఎఫ్‌సీఐ గోడౌన్స్, సుగర్ ఫ్యాక్టరీ, కెనాల్ రోడ్డు మీదుగా ఉండూరులో ఇది కలవనుంది. అచ్చంపేట జంక్షన్‌లో ఒక ఫ్లై ఓవర్ నిర్మించాల్సి ఉంది. చురుగ్గా భూ సేకరణ చేపడుతున్నారు. 13 కిలోమీటర్ల మేర పనులు మొదలయ్యాయి. 33.92 హెక్టార్ల భూమి సేకరించి ఏడాదిలోపు ఈ హైవే పనులను పూర్తి చేయనున్నారు. ఈ రహదారి సామర్లకోట, కాకినాడ రూరల్ మండలాల్లో ఆరు గ్రామాల మీదుగా ప్రయాణిస్తుంది. నాలుగు వరుసల మూడు ప్రధాన జాతీయ రహదారులతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలతో తీరానికి అనుసంధానమవుతుంది. తద్వారా పారిశ్రామిక ప్రగతికి మార్గం సుగమమం అవుతుంది.



పోర్టు రోడ్డులో శరవేగంగా జరుగుతున్న భారత్‌మాల పనులు

అవుటర్ రింగ్ రోడ్డు తరహాలో..

కాకినాడ వాకలపూడి లైట్‌హౌస్ నుంచి అన్నవరం మీదుగా కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారితో అనుసంధానించనున్నారు. 40.32 కి లోమీటర్లు నిడివి కలిగిన ఈ నాలుగు వరుసల జాతీయరహదారిని తొలుత రూ.776.82 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు.

- కాకినాడ పోర్టు, కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి, కాకినాడ గేట్‌వే పోర్టు, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ మీదుగా ఈ జాతీయ రహదారి వెళ్లనుంది.
- వాకలపూడి జంక్షన్‌లో ఒక ఫ్లై ఓవర్, అన్నవరం, కాకినాడ సెజ్, హార్బర్‌ల వద్ద అండర్‌పాస్‌లను నిర్మించాల్సి ఉంటుంది.
- హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు తరహాలో ఈ జాతీయ రహదారి ఏర్పాటు కానుంది.
- ఇప్పుడు రహదారి అంచనా వ్యయం రూ.1400 కోట్లకు పెరిగింది.
- ఎక్కువగా భూ సేకరణ చేయాల్సి వస్తోంది. ఇందుకు రూ.160 కోట్లకుగాను ఇప్పటికే రూ.56 కోట్లు విడుదల చేశారు.
- రెండేళ్లలోపు అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు.
- తొండంగి, శంఖవరం, యు కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాల్లోని 21 గ్రామాల మీదుగా ఈ జాతీయ రహదారి సాగుతుంది.

ఫ్లై ఓవర్లు.. అండర్‌పాస్‌ల వల్ల పెరిగిన అంచనా వ్యయం

మూడు హైవేలను గడువులోగా పూర్తి చేస్తాం. భారతమాల ప్రాజెక్టులో చేపట్టిన ఈ రోడ్ల వల్ల విశాఖపట్నం, ఉమ్మడి గోదావరి జిల్లాల మధ్య అనుసంధానమేర్పడుతుంది. వాకలపూడి లైట్‌హౌస్ నుంచి అన్నవరం వరకు వస్తోన్న జాతీయ రహదారికి మధ్యలో కాకినాడ సెజ్, ఉప్పాడ హార్బర్ ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాల్సి ఉంది. ఈ కారణంగానే అంచనా వ్యయం రూ.1400 కోట్లకు పెరిగింది. సేకరించిన ప్రైవేట్ భూములకు వెంటనే పరిహారం చెల్లిస్తున్నాం.

– సురేంద్రనాథ్, ప్రాజెక్టు డైరెక్టర్, జాతీయ రహదారులు విభాగం




ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి వనిత, ఎంపీ భరత్, జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

- ఎమ్మెల్యే కుమార్తె రిసెప్షన్‌కు జగన్ హాజరు
- నిడదవోలులో జేజేలు పలికిన ప్రజలు

సాక్షి, రాజమహేంద్రవరం/నిడదవోలు రూరల్: నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు కుమార్తె డాక్టర్ సౌమ్య శ్రీ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొనేందుకు బుధవారం నిడదవోలు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. 10.50 గంటలకు పట్టణంలోని సుబ్బరాజుపేట వద్ద హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు స్వాగతం పలికారు. వారందరినీ సీఎం ఆప్యాయంగా పలకరించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సెయింట్ ఆంబ్రోస్ స్కూల్లో రిసెప్షన్ వేదికకు బయలు దేరారు. దారి పొడవునా 'జై.. జగన్.. సీఎం.. సీఎం' అంటూ ప్రజలు, అభిమానులు నినదించారు. సీఎం వారికి అభివాదం తెలుపుతూ ముందుకు కదిలారు. రిసెప్షన్ వేదిక వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా సందడి వాతావరణం నెలకొంది. వేడుకకు వచ్చిన వారంతా ఒక్కసారిగా పైకి లేచి తమ అభిమాన నేతను చూసేందుకు ఎగబడ్డారు. సీఎం వారికి అభివాదం చేస్తూ రిసెప్షన్ వేదికపై ఉన్న సౌమ్య, శివతేజ దంపతుల వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిని పరిచయం చేసుకుని దీవించారు. నూతన వధూవరులు, కుటుంబ సభ్యులతో సరదాగా సెల్ఫీ దిగారు. అనంతరం తాడేపల్లి బయలుదేరారు.

ఘన స్వాగతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తొలుత ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో హోం మంత్రి తానేటి వనిత, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెల్లుబోయిన వేణు, ప్రభుత్వ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్మన్లు విప్పర్తి వేణుగోపాల్‌రావు, కవురు శ్రీనివాస్, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాదరాజు, జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావ్, సత్తి సూర్యనారాయణరెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, కొండేటి చిట్టిబాబు, మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి ఉన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూడగానే ఉత్సాహంగా అభివాదం తెలుపుతున్న నాయకులు, అభిమానులు



న్యూస్‌రీల్

వీల్‌చైర్ క్రికెట్ జాతీయ జట్టులో ప్రవీణ్



మానుపాటి ప్రవీణ్‌కుమార్

రాజమహేంద్రవరం రూరల్: గుజరాత్‌లోని సూరత్‌లో ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఇండియా, బంగ్లాదేశ్ జట్ల మధ్య అంతర్జాతీయ వీల్‌చైర్ క్రికెట్ టోర్నీ (టీ20 సిరీస్) జరుగుతుంది. కాతేరు గ్రామ పంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ధవళేశ్వరం గ్రామానికి చెందిన మానుపాటి ప్రవీణ్ కుమార్ ఇండియా జట్టులో సభ్యుడిగా ఎంపికయ్యారు. ఆయన ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ వీల్‌చైర్ క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు.

వేకువనే పింఛన్ పిలుపు

జిల్లాలో 83.09 శాతం పంపిణీ



చికిత్సపొందుతున్న గంగారత్నంకు పింఛన్‌ను అందజేస్తున్న ధవళేశ్వరం వలంటీర్ స్వర్ణరాజు

రాజమహేంద్రవరం రూరల్: తెల్లవారుతుండగానే వలంటీర్లు పింఛన్ లబ్ధిదారుల తలుపు తట్టారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం నుంచే ప్రారంభమైంది. గ్రామ,వార్డు వలంటీర్లు ఉదయం 5 గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. అవ్వాతాతల ముఖాల్లోసంతోషం వెల్లివిరిసింది. వేలిముద్రలు పడని వృద్ధులకు ఆధార్ ముఖగుర్తింపుతో పింఛన్‌ను అందించారు. ఇతర ప్రాంతాల్లోని పెన్షన్‌దారులకు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి దగ్గరకు వెళ్లి మరీ అందజేయడం విశేషం.రాత్రి 7గంటలకు 83.09 శాతం పంపిణీ పూర్తయింది. 1,96,290 మందికి రూ.54.08 కోట్లు అందజేశారని డీఆర్‌డీఏ వైఎస్సార్‌క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు.



ఉన్మాదుల ఉగ్రరూపం

- ప్రేమ పేరుతో పైశాచికత్వం
- వికృత రూపం దాల్చుతున్న ప్రేమోన్మాద ధోరణి
- కలవరపెడుతున్న హత్యలు
- బలవుతున్న యువతులు

- ఫిబ్రవరి28: బతుకు తెరువు కోసం బెంగళూరుకు వెళ్లిన కాకినాడ యువతి నలమాటి లీలా పవిత్రని ప్రేమోన్మాది బాణాల దినకర్ కడతేర్చాడు. ఆఫీసు నుంచి బయటికి వస్తున్న ఆమెపై అప్పటికే తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. విచక్షణారహితంగా 16 పోట్లు పొడిచి రక్తం కళ్లజూశాడు. చనిపోయిందని నిర్ధారించుకొని శవం పక్కనే కూర్చున్నాడు. పోలీసులు వస్తే తన నిర్వాకాన్ని చెప్పి అరెస్టయ్యాడు.
- గతేడాది అక్టోబరు: తన ప్రేమను కాదన్నందుకు గుబ్బల వెంకట సత్యనారాయణ అనే ప్రేమోన్మాది కరప మండలం కూరాడలో కాదా దేవిక అనే యువతిని కత్తితో 18 పోట్లు పొడిచి చంపేశాడు. ఈ ఘటనలో కేవలం 143 రోజుల్లోనే దిశ చట్టం స్ఫూర్తితో వేగవంతమైన విచారణ జరిగి నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది.

కాకినాడ క్రైం: ప్రేమ పేరుతో ఉన్మాదం పేట్రేగిపోతుంది. ఆడపిల్లల జీవితాలను బలిగొంటోంది. తాజాగా కాకినాడకు చెందిన 26 ఏళ్ల లీలా పవిత్ర బెంగళూరులో ఓ ప్రేమోన్మాది చేతిలో హతమవ్వడంతో జిల్లా ప్రజలు నిర్ఘాంతపోయారు. రాధాకృష్ణ వేణి, అబ్బులు చౌదరి దంపతులకు లీలా పవిత్ర ఏకైక సంతానం. తల్లి గృహిణి. తండ్రి అబ్బులు హేచరీ వ్యాపారం చేస్తారు. వర్క్ ఫ్రం హోం చేస్తూ ఈ ఏడాది జనవరి వరకు కాకినాడలోనే ఉంది. సంక్రాంతి తర్వాత లీల తిరిగి బెంగళూరుకు వెళ్లింది.

న్యూస్‌రీడర్ కావాలని...

విశాఖపట్నం బుల్లయ్య కాలేజీలో ఎంఎస్సీ చదివిన లీలకు న్యూస్ రీడింగ్ అంటే ప్రాణం. ఆ ఇష్టంతోనే 2019 నుంచి 2021 మధ్య జిల్లా ఛానల్ ఈజీ టీవీలో న్యూస్ రీడర్‌గా పనిచేసింది. బెంగళూరు వెళ్లి ఏడాది కూడా పూర్తి కాలేదు. ఏదో ఒక రోజు పెద్ద ఛానల్‌లో న్యూస్‌రీడర్‌ని అవుతానని తమతో చెబుతూండేదని సహోద్యోగి సూర్య ఆకొండి తలచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. సంక్రాంతి తర్వాత తిరిగి బెంగళూరుకు బయల్దేరుతూ దిగులు పడొద్దంటూ తల్లికి ఆమె ధైర్యం చెప్పింది. పుట్టిన రోజు నీ దగ్గరే చేసుకుంటానంటూ ఓదార్చి రైలెక్కింది. అదే తన కూతురును చూసిన ఆఖరి చూపు అని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.



న్యూస్ రీడర్‌గా వార్తలు చదువుతూ

క్లాస్‌మేటే హంతకుడు

లీలను కిరాతకంగా హతమార్చిన నిందితుడు దినకర్‌ది శ్రీకాకుళం జిల్లా. లీలకు ఎంఎస్సీ క్లాస్ మేట్ కూడా. వీరిద్దరూ విశాఖపట్టణం బుల్లయ్య కాలేజీలో కలిసి చదువుకున్నారు. ప్రేమిస్తున్నానని వేధింపులకు గురిచేసేవాడు. ఉద్యోగం వచ్చి లీల బెంగళూరుకు వెళితే, అక్కడికీ చేరాడు. పెళ్లి సంబంధాలు చూస్తున్నాం అంటూ తల్లిదండ్రులు చెబితే లీల వణికిపోయేది. దినకర్ వద్దంటున్నాడని, పెళ్లి చేసుకోనివ్వనని బెదిరిస్తున్నాడని తల్లిదండ్రుల వద్ద వాపోయేది. కలిసి చదువుకున్నాడు ..అర్థం చేసుకుంటాడు..అని వారూ ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఆధిపత్య ధోరణితో దినకర్ నిత్యం లీలను ఇబ్బందుల పాలు చేసేవాడు. ఉద్యోగం చేసుకోనివ్వకుండా వేధించేవాడు. చేసే ప్రతి పని తన కనుసన్నల్లోనే జరగాలంటూ ఆదేశించేవాడు. ఈనేపథ్యంలో పెళ్లి కాదందని మంగళవారం రాత్రి కత్తితో సహోద్యోగులు చూస్తుండగానే నరికి చంపేశాడు.

ప్రేమించిన వ్యక్తి సొంత సొత్తేం కాదు....

ప్రేమించిన వ్యక్తి సొంత ఆస్తి కాదు.. ఇష్టాయిష్టాలన్నీ అవతలి వారి అభిప్రాయాలపై ఆధారపడి ఉంటాయి. ప్రేమని అత్యంత గొప్ప విషయంగా సమాజం చిత్రీకరించి చూపి తప్పుచేసింది. ప్రేమ జీవితంలో ఏకైక గొప్ప అంశం అన్న ఆలోచన పాఠశాల స్థాయి నుంచి ప్రభావం చూపుతోంది. ఎలా అయినా దక్కించుకోవాలని అందుకు ఏమైనా చేయాలి అనే భావనను మానసిక శాస్త్రంలో ఇంపల్సివ్‌నెస్ అంటారు. ఆ ఇంపల్సివిటీని నియంత్రించుకోలేని వారు ఉన్మాదులుగా, హంతకులుగా మారుతారు. స్నేహితుడిని ఎంచుకోవడంలో అత్యంత జాగ్రత్త వహించాలి. క్షణికావేశానికి లోనై తమ విచక్షణ కోల్పోయే వారు ఎప్పటికైనా ప్రమాదకారులే. అమ్మాయిలూ ముఖ్యంగా జాగ్రత్త పడాలి. పిల్లల్ని తీర్చిదిద్దుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉంటుంది. ఎప్పటికప్పుడు నడవడికను గమనించి సరిదిద్దాలి.

– డాక్టర్ వరప్రసాద్ వానపల్లి, సైక్రియాట్రిస్ట్, కాకినాడ జీజీహెచ్

జిల్లా శాఖ నుంచి సిఫార్సు చేస్తాం

లీలా పవిత్ర హత్య అత్యంత దారుణం. 16 కత్తి పోట్లతో హతమార్చిన విధానం హంతకుడు దినకర్ క్రూరత్వాన్ని వెల్లడిస్తోంది. రాష్ట్ర శాఖ ద్వారా బెంగళూరు పోలీసులకు అనుసంధానం అవ్వాలని నిర్ణయించాం. కాకినాడ పోలీస్ శాఖ నుంచి తగిన సిఫార్సు చేసి కట్టుదిట్టమైన సెక్షన్లతో హంతకుడికి తగిన శిక్ష పడేలా చేస్తాం. ఇదే తరహా నేరం దేవిక అనే యువతి విషయంలో జరిగితే దిశ చట్టం ద్వారా అత్యంత తక్కువ వ్యవధిలో హంతకుడికి యావజ్జీవ కారాగార శిక్ష వేయించాం. ఈ విషయాన్ని కన్నడ పోలీసులకు వెల్లడిస్తాం. బిడ్డలు పడుతున్న ఇబ్బందుల్ని తల్లిదండ్రులు సీరియస్‌గా తీసుకోవాలి.

– ఎం.రవీంద్రనాథ్‌బాబు, ఎస్పీ, కాకినాడ జిల్లా

ఎమ్మెల్సీ ఓటింగ్‌కు ఏర్పాట్లు చేయాలి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కొవ్వూరు డివిజన్‌లో ఓటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎంకే మీనా బుధవారం సాయంత్రం వెలగపూడి నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొవ్వూరు డివిజన్ పరిధిలో 242 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కొవ్వూరు మునిసిపాలిటీలో 23 మంది, నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో 28 మంది, జెడ్పీటీసీలు 9 మంది, ఎంపీటీసీలు 179 మంది, ముగ్గురు శాసన సభ్యులు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్



జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి పి.అన్నపూర్ణ

కొవ్వూరు: వినియోగదారుల హక్కుల, కుటుంబ తగాదాలకు సంబంధించి ఈనెల 18వ తేదీనప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి పి.అన్నపూర్ణ ఈమేరకు తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కొవ్వూరులో దీనిని నిర్వహిస్తున్నామన్నారు. రాజీమార్గం ద్వారా కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

తక్కువ వడ్డీకి ఎల్ఐసీ గృహరుణాలు

- ప్రజల సొంతింటి కల నెరవేర్చుతాం
- రీజినల్ మేనేజర్ జయప్రకాష్ బాబు



జ్యోతిప్రజ్వలన చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జయప్రకాష్‌బాబు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రజల సొంతింటి కలను ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తీర్చుతుందని ఆ సంస్థ రీజినల్ మేనేజర్ డి.జయప్రకాష్ బాబు అన్నారు. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ రాజమహేంద్రవరం ఏరియా ఆఫీసును మెయిన్ రోడ్డు ఎల్ఐసీ బిల్డింగ్ నుంచి ఇన్నీసుపేట ఆల్ఫా డిజిటల్ ఎదురుగా ఉన్న భవనంలోకి బుధవారం మధ్యాహ్నం మార్చారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ జయప్రకాష్ బాబు, రీజినల్ మార్కెటింగ్ హెడ్ వైవీ రామకృష్ణారావు, మేనేజర్ ఆపరేషన్స్ ఆర్.విజయశ్రీ కొత్త కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జయప్రకాష్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ కేవలం 8.45 శాతం వడ్డీతో రుణాలు అందజేస్తున్నామని, ప్రాసెసింగ్ చార్జీల రాయితీ ఇస్తున్నామన్నారు. వైజాగ్ పరిధిలో ఆరు బ్రాంచ్‌లు ఉంటే, వాటిలో రాజమహేంద్రవరం ఏరియా ఆఫీసు సిబ్బంది అత్యున్నత పనితీరుతో ముందుగానే వ్యాపార లక్ష్యాన్ని సాధించారన్నారు. ఇప్పటికే సుమారు రూ.300 కోట్ల వ్యాపారం చేశారని, ఈ ఆర్థిక సంవత్సరం చివరకు రూ.500 కోట్ల వ్యాపారం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నారన్నారు. త్వరలో తునిలో బ్రాంచి ఏర్పాటు చేస్తామన్నారు. రాజమహేంద్రవరం ఏరియా మేనేజర్ శివప్రసాద్, మార్కెటింగ్ టీం సభ్యులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

'నన్నయ'లో చైల్డ్ సైకాలజీపై పీజీ డిప్లమా కోర్సు

● 17లోగా దరఖాస్తు చేసుకోవాలి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో చైల్డ్ అండ్ అడోలెసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లమా కోర్సును ప్రారంభించనున్నామని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తెలిపారు. బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ డిపార్టుమెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యంలో నిర్వహించే ఏడాది కాలపరిమితో కూడిన ఈ కోర్సులో ప్రవేశానికి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7093008477 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.


పాఠశాలలో పాము హల్‌చల్



సర్పాన్ని పట్టుకున్న వార్డెన్ ప్రభాకర్

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం ఉదయం ఒక పాము హల్‌చల్ చేసింది. ఉదయం 9 గంటలకు విద్యార్థులు పాఠశాలకు వచ్చిన కొద్దిసేపటికే ఆ సర్పం హైస్కూల్ ఆవరణలోకి వచ్చింది. దీంతో విద్యార్థులు ఆందోళన చెందారు. జగ్గంపేట సాంఘిక సంక్షేమ శాఖ వార్డెన్ పెట్టా ప్రభాకర్‌కు పాములు పట్టడంలో అనుభవం ఉందని తెలిసి ఆయనకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన వచ్చి పామును చాకచక్యంగా పట్టుకున్నారు. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

కౌలు రైతు అనుమానాస్పద మృతి



కొండలరావు మృతదేహం

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి గ్రామంలో పురుగుల మందు పిచికారీ చేసేందుకు పొలానికి వెళ్లిన కౌలు రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పి.గన్నవరం ఏఎస్సై ఇళ్ల ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. ఊడిమూడి శివారు చింతావారిపేటకు చెందిన బీర కొండలరావు (45) గ్రామంలో కొంతభూమిని కౌలుకు సాగు చేస్తున్నాడు. మంగళవారం చేనుకు పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చేనువద్దకు వెళ్లి గాలించగా, అతడి మృతదేహం కనిపించింది. దీంతో మృతుని కుమారుడు సన్నీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై ఏడుకొండలు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

సమస్యలు రిపీట్.. స్పందన రొటీన్

- ప్రహసనంలా 'డయల్ యువర్ ఈఓ'
- రెండేళ్లుగా ప్రతీ నెల చివరి సోమవారం నిర్వహణ
- మూడు వందలకు పైగా ఫిర్యాదులు వచ్చినా పరిష్కారం కాని వైనం



అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ప్రతీ నెల చివరి సోమవారం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ ఈఓ' కార్యక్రమం ప్రహసనంలా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా నుంచే కాకుండా విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఫోన్ చేసి దేవస్థానంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సలహాలు, సూచనలు చెబుతుంటారు. అధికారులు వీటిపై పరిశీలించి చర్య తీసుకుంటాం అని చెప్పడమే తప్ప ఇంతవరకు ఏ చర్య తీసుకున్నారో ఆ ఫోన్ చేసిన భక్తులకు తెలియచేయడం కాని, లేదా పత్రికా ముఖంగా వివరించడం కాని చేయడం లేదు. దీంతో అవే ప్రశ్నలు భక్తుల వద్ద నుంచి రిపీట్ అవుతున్నాయి. రెండేళ్లలో సుమారు 300 మంది ఫోన్ చేసి తమ సమస్యలు, సూచనలు తెలియచేశారు. వీటిలో కొన్ని ఫేక్ కూడా ఉంటున్నాయి. వాటిని మినహాయించి మిగిలిన వాటిని పరిష్కరించడం లేదా ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో వివరించే ప్రయత్నం జరగడం లేదు.

ప్రతీ వారం భక్తులు వివరించే సమస్యలు

- జాతీయ రహదారిపై గల సత్యదేవుని నమూనా ఆలయం వద్ద గల ప్రసాదం విక్రయశాల వద్ద వసతులు లేవు. వర్షాకాలం వస్తే ప్రసాదం ప్యాకెట్లు తడిసిపోయి వాసన వస్తున్నాయి. అక్కడ సరైన షెల్టర్, బాత్‌రూమ్స్ లేవు. బంగీ ప్రసాదం స్టాక్ ఉండడం లేదు.
- దేవస్థానంలో టాయిలెట్స్ సరిగా లేవు. పశ్చిమ రాజగోపురం వద్ద రెండు మాత్రమే ఉన్నాయి. వెస్ట్రన్ కమోడ్ టాయిలెట్స్ ఎక్కడా లేవు. వికలాంగులు, కాళ్లు నొప్పులు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు.
- అన్నవరం నుంచి కోటిపల్లికి దేవస్థానం బస్సులు పునరుద్ధరించాలని భక్తులు చాలాసార్లు కోరారు. నడపడం సాధ్యపడుతుందా లేదా అనే విషయం తేల్చి చెప్పడం లేదు.
- ఆలయంలో చాలాచోట్ల వివరాలు తెలిపే సైన్ బోర్డులు లేవు.
- రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించే మహిళల చీరలకు మంట అంటుకోకుండా చెట్టు మొదలుకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలి.

స్పందన ఉండేలా చర్యలు



భక్తులు చేసిన ఫిర్యాదులు, సూచనలపై స్పందించి వారికి సమాధానం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. దీనిపై ఒక నివేదిక తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించాం.

– ఈఓ సత్యనారాయణమూర్తి

సత్యకుమార్‌కు యంగ్ సైంటిస్టు అవార్డు



వెంకటసత్యకుమార్

రౌతులపూడి: తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ యంగ్ సైంటిస్టు అవార్డుకు రౌతులపూడికి చెందిన డాక్టర్ అనిమిరెడ్డి వెంకటసత్యకుమార్ ఎంపికయ్యారు. ఆయన ఈ విషయాన్ని స్థానిక విలేకర్లకు బుధవారం తెలిపారు. 2021 సంవత్సరానికిగాను ఈ అవార్డు లభించిందన్నారు. జాతీయ భూ భౌతిక పరిశోధనా సంస్థ(సీఎస్ఐఆర్–ఎన్‌జీఆర్ఐ)లో పనిచేస్తున్న తాను భౌతిక శాస్త్రంలో చేసిన విశిష్ట పరిశోధనలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. 2021లో చంద్రుని లోతు, ఉపరితల నిర్మాణం అనే విషయంపై పరిశోధన జరిపి ఆంధ్రా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు వివరించారు. 2019లో నాసా ఫెలోషిప్‌నకు ఎంపికైనట్లు తెలిపారు. చైనాలో విజిటింగ్ రీసెర్చ్ ఫెలోగా పనిచేశానని, 2014లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిభా అవార్డు పొందినట్లు తెలిపారు.

డెంటల్ విద్యార్థులకు ఐదున్నరేళ్లలోనే పిజీ డిగ్రీ

డూండీ యూనివర్సిటీతో జీఎస్ఎల్ ఒప్పందం



జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్‌తో సమావేశమైన డూండీ యూనివర్సిటీ ప్రతినిధులు

రాజానగరం: ఐదేళ్ల బీడీఎస్ కోర్సు పూర్తిచేసిన డెంటల్ విద్యార్థులకు ఆరునెలల వ్యవధిలోనే పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంపీహెచ్‌సీడీ (మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్ విత్ క్లినికల్ డెంటిస్ట్రీ) పూర్తిచేసే అవకాశాన్ని జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ అందించనుంది. జీఎస్ఎల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ భాస్కరరావు ఈవిషయం తెలిపారు. యునైటెడ్ కింగ్‌డమ్, స్కాట్లాండ్‌లోని డూండీ యూనివర్సిటీతో తమ కాలేజీ చేసుకున్న ఒప్పందం ద్వారా ఈ అవకాశం లభిస్తుందన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ వైద్య సంఘాల ప్రమాణాల మేరకు దంత వైద్యంలో బేసిక్స్ (బేసిక్స్ ఆఫ్ ఎనస్థీషియా, సర్జరీ అండ్ ఇన్‌టెన్సివ్ కేర్ ఇన్ క్లినికల్ సినేరియా), లైఫ్ (ఇంప్లాంట్స్, ఫేషియల్ ఈస్తటిక్స్, ఎండోడాంటిక్స్)ను తమ కాలేజీ రూపొందించిందన్నారు. వీటిపై కాపీరైట్స్ కూడా సాధించామని తెలిపారు. డూండీ యూనివర్సిటీ ప్రతినిధులు బుధవారం ఇక్కడకు వచ్చి, ఈ రెండు కొత్త కోర్సుల ప్రామాణికతను పరిశీలించిన తర్వాత ఒప్పందం చేసుకున్నారన్నారు. డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్ మాట్లాడుతూ సాధారణంగా బీడీఎస్ ఐదేళ్లు, ఎండీఎస్ మూడేళ్లు చేసిన తరువాతనే పీజీ డిగ్రీ వస్తుందన్నారు. అయితే ప్రస్తుతం కుదిరిన ఒప్పందం ప్రకారం.. బీడీఎస్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లో చివరి ఆరు నెలలు బేసిక్, లైఫ్ కోర్సులు ఉంటాయని, వీటిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డూండీ యూనివర్సిటీ వీసా ఇచ్చి, ఆరు నెలల ఎంపీహెచ్‌సీడీ – పీజీ కోర్సులో ప్రవేశాన్ని కల్పిస్తుందన్నారు. ఈ కోర్సులో ఉత్తీర్ణత సాధించిన డెంటల్ విద్యార్థులకు ఐదున్నరేళ్లలోనే పీజీ డిగ్రీ వస్తుందన్నారు. సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ గన్ని సందీప్ పాల్గొన్నారు.

భార్య అశ్లీల చిత్రాలు వాటాప్స్ చేసిన యువకుడి అరెస్ట్

కాట్రేనికోన: మండలంలోని తీర ప్రాంత గ్రామంలో మైనర్ బాలికను పెళ్లి చేసుకున్న యువకుడు, తొలి రాత్రి అశ్లీల చిత్రాలను వాటాప్స్ గ్రూప్‌లో పోస్టు చేయగా, అతనిని కాట్రేనికోన ఎస్సై.టి శ్రీనివాస్ అరెస్టు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న మైనర్ బాలికను ఆ యువకుడు వివాహం చేసుకున్నాడు. తొలి రాత్రి భార్యతో ఏకాంత చిత్రాలను ఫోన్ ద్వారా ఫొటో తీసి వాట్సాప్‌లో పోస్టు చేశాడు. ఈ నెల 20న బాధితురాలి తల్లి చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ముమ్మిడివరం సీఐ జానకిరామ్ విచారణ చేపట్టి నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై టి.శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల్లో విశ్వసనీయత పొందండి

- కాల్ రాగానే ఐదు నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకోండి
- పోలీస్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



రాజమహేంద్రవరంలో పోలీస్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



స్పోర్ట్స్ క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పోలీసులు ప్రజల్లోకి మరింతగా వెళ్లాలని, విశ్వసనీయత పొందే విధంగా వ్యవహరించాలని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. రాజమహేంద్రవరం జాంపేట పోలీస్ క్వార్టర్స్ వద్ద రూ.1.80 కోట్లతో నిర్మించిన పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌ను డీజీపీ బుధవారం ప్రారంభించారు. పోలీసులకు బాధితులు ఫోన్ చేస్తే ఘటనా స్థలానికి ఐదు నిమిషాల్లో చేరుకోవాలన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసులు తగ్గుతున్నాయని, ఏడాది వ్యవధిలో 77 వేల కేసులు తగ్గించామన్నారు. కాకినాడ జిల్లాలో యువతిని నడిరోడ్డుపై నరికి వ్యక్తికి నాలుగు నెలల్లో శిక్ష వేయించామన్నారు. ఇది ఏపీ పోలీస్‌శాఖకు పెద్ద ఘనత అన్నారు. దిశ చట్టం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఇప్పటివరకు కోటి 30 లక్షల మంది దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. మహిళా పోలీసుల ద్వారా చిన్న చిన్న గొడవలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ఏపీ పోలీసులపై ప్రజల్లో విశ్వసనీయత పెరిగిందన్నారు. దిశ చట్టం వచ్చేలోపు ఆ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నామన్నారు. స్టేషన్ పరిధిలో ప్రతీ సీఐ, ఎస్ఐకి 10 కేసుల చొప్పున దర్యాప్తు పూర్తి చేసేలా అప్పగించామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 100 మంది మరణిస్తే 60 మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృత్యువాత పడుతున్నారన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. గంజాయి కేసుల్లో ఇప్పటివరకు చాలా మందిని అరెస్టు చేశామని, వారికి దీనికి సప్లై చేస్తున్న వారి వివరాలను సేకరించి ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. విద్యార్థులు దీని బారిన పడకుండా కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను జిల్లా పోలీసు అధికారులు అరికట్టారన్నారు.

నిబంధనలు పాటించాలి

పోలీసులే ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని మీడియా అడిగిన ప్రశ్నకు డీజీపీ సమాధానం చెబుతూ నిబంధనలకు అనుగుణంగా ప్రవర్తిస్తే ఎవరినీ అడ్డుకునేది లేదని, అంతేకాని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, ప్రాణనష్టం తెచ్చేలా ఉంటే చట్టాన్ని వ్యతిరేకించినట్టేనన్నారు. సభలు, సమావేశాలు పెట్టుకోవడానికి పోలీసులు నిర్దేశించిన, ఖాళీగా ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలే కాని, ఇరుకు ప్రాంతాల్లో నిర్వహిస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. అనపర్తి ఘటనలో కేసుల దర్యాప్తు వివరాలు వెల్లడిస్తామన్నారు. సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు అందే బెనిఫిట్స్‌పై ఎక్కువగా చింతించవద్దని, ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు, జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాశ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. బొమ్మూరులో రూ.45 లక్షలతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను డీజీపీ ప్రారంభించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ టెన్త్, ఇంటర్ పసిపెడ్డింగ్ (రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిల్ అయినవారు కట్టుకొనే అవకాశం) డిగ్రీ, పీజీ, (సైన్స్ & ఆర్ట్స్) MBA, B.Li.Sc, M.Li.sc, ఎగ్జామ్స్ అన్నీ మా విద్యాసంస్థల్లో జరుగును. 100% పాస్, మా ఆఫీస్ & కాలేజి కాకినాడ దగ్గరలో గల గొల్లలపాలెం, కాకతీయ విద్యా సంస్థలు. 2023 – 2024 అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫోన్: 98495 82043, ఆత్రేయపురం ఫోన్: 83414 82043, రాజమండ్రి ఫోన్: 99494 82757 [V-1769]

Real Estate

PLOT FOR SALE

■ స్థలం అమ్మకం. కొంతమూరు శానిటోరియమ్ స్కూల్ ప్రక్కన, 2 రోడ్ల కార్నర్ బిట్, 366 చ॥గ॥ స్థలం. రీజనబుల్ రేట్‌కే అమ్మబడును. 94401 79277 [R-5667]

■ కేవలం 7 లక్షలకే 25 సెంట్ల భూమి & 100 ఎర్ర చందనం మొక్కలతో స్పాట్ రిజి. 10 సం॥ తరువాత అధిక ఫలసాయం. మీ పిల్లల భవిష్యత్తుకు లాభదాయకమైన పెట్టుబడి. భవిష్యత్ ఆర్థిక అవసరాలకు భరోసా ఎర్రచందనం సాగు ఒక్కటే మార్గం. వాయిదా పద్ధతి కలదు ✆ 96031 84207, 96661 66407 [B-2326]

Services

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034974058 [H-792938]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1193753]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2281]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786687]

HEALTH CARE

■ మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరగడానికి, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. రాజమండ్రి : (ఇంతకు ముందు మెట్రోలాడ్జి) ఇప్పుడు Same కేంప్ "శ్రీ సాయిలక్ష్మి లాడ్జిలో మందులు" SVG మార్కెట్ రోడ్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీ నెల 3, 17 తేదీన మందులు [V- 2543]

Wanted

■ హైదరాబాద్‌లోని ఆప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21–45 వయసు గల M/F Caretakers కావలెను. జీతం: 16–18 వేలు, భోజనం,వసతి,ఇన్సూరెన్సు కలవు.9381848549 [G-394]

■ ప్రముఖ హోటల్‌లో పనిచేయుటకు Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ : 12గం॥, జీతం : 13000/– + PF + ESI. స్థలం : రాజమండ్రి. ఫోన్ : 93909 14411 [V- 6086]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190580]

■ ఇంటిపని, బేబికేర్, పేషేంట్‌కేర్ M/F వంటపని, భార్యాభర్తలు కావలెను. Sale 18K to 25K, రూం + భోజనం Ph: 9160002193, 9160002192 [H-796813]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి, పార్ట్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ ప్రతి రోజూ రూ. 500 నుండి రూ. 600 వరకు సంపాదించే అవకాశం. డైలీ పేమెంట్స్. సంప్ర: 9985782069. [A-465]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059508586 [G-781923]

■ కాకినాడ, ఉప్పాడ పరిసర ప్రాంతంలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ అర్జెంటుగా కావలెను. మంచిజీతం. సంప్ర: 9100450245, 7386285004 [G-781793]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ చేతి వ్రాత ద్వారా ఓల్డ్ రికార్డ్స్ చూసి న్యూ రికార్డ్స్ రాయుటకు స్త్రీ / పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/–. ఫోన్ : 80084 01243 [V- 6078]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్ నర్సులు, వంటవారు, Rmp Dr. Q-5th-డిగ్రీ, 10–30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. ఫోన్ : 7995365999 [HA-1030]

■ సేల్స్ రిప్రజెంటివ్స్ లేడీస్ Only. ఇంటర్‌నేషనల్ కంపెనీ Instant Coffee Mix న్యూట్రిషన్ ఇమ్యూనిటీ మిల్క్ సేల్స్, ఫీల్డ్ వర్క్. 25,000/– శాలరీ + ఇన్‌సెంటివ్స్. రాజమండ్రి, రావులపాలెం అన్ని ఏరియాలలో 91214 54187 [R-1234444]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోలీసులమని చెప్పి దోపిడీ

పిఠాపురం: క్రైం పార్టీ పోలీసులమని చెప్పి పట్టణంలో ఒక వ్యక్తిని బెదిరించి డబ్బులు లాక్కెళ్లిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులకు నమ్మలేని నిజాలు తెలిశాయి. పోలీసుల కథనం ప్రకారం కాకినాడకు చెందిన కేదారశెట్టి వెంకటరమణ పిఠాపురం బ్యాంకులో పిగ్మీ డిపాజిట్ స్కీంలో కమీషన్ పద్ధతిపై కలెక్షన్ ఏజెంటుగా పని చేస్తున్నాడు. గత నెల 14వ తేదీన కలెక్షన్ సొమ్ముతో కాకినాడ వెళ్లేందుకు స్థానిక చర్చి సెంటర్లో ఉండగా ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి తాము క్రైం పార్టీ పోలీసులమని చెప్పారు. అసలు నువ్వు ఎవరు? నీ దగ్గర డబ్బులు ఎందుకు ఉన్నాయి? నడు స్టేషన్‌కి అంటూ బెదిరించారు. డబ్బులు ఇస్తే వదిలేస్తాం లేకుంటే స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేయవలసి ఉంటుంది అని అతని వద్ద నున్న రూ.15 వేలు లాక్కుని వెళ్లి పోయారు. ఎవరికైనా చెబితే కేసుల్లో ఇరికిస్తాంటూ బెదిరించడంతో భయపడి ఎవరికి చెప్పకుండా ఉండిపోయాడు. తిరిగి గత నెల 24వ తేదీన మళ్లీ డబ్బులు వసూలు చేసుకుని కాకినాడ వెళ్లేందుకు పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద బస్సు కోసం వేచి ఉండగా ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఎస్సై గారు రమ్మంటున్నారు అని బెదిరించి మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లి అక్కడ ఆపకుండా చిత్రాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి కిందకు తీసుకెళ్లారు. అప్పటికే అక్కడ మరో ఇద్దరు వ్యక్తులు ఉండి నలుగురు కలిపి ఎస్సై గారు వస్తున్నారు ఆయన వచ్చే లోపు డబ్బులు ఇస్తే వదిలేస్తాం డబ్బులు ఇవ్వకపోతే జైలుకి వెళ్లిపోతావు అంటూ బెదిరించి బలవంతంగా అతని వద్ద నున్న రూ.35 వేలు బ్యాగ్ లాక్కుని బాధితుడిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో బాధితుడు వెంకటరమణ పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు వచ్చి పోలీసులు తన వద్ద డబ్బులు లాక్కెళ్లిపోయారని చెప్పగా కంగుతిన్న పోలీసులు దోపిడీ చేసింది నకిలీ పోలీసులని నిర్ధారించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై జగన్మోహన్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు నలుగురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

5న మధుశ్రీ పురస్కారాలు



రామశాస్త్రి

కాజులూరు : మధుశ్రీ కలం పేరిట కథారచయితగా ప్రసిద్ధుడైన మధునాపంతుల వెంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా ముగ్గురు సాహితీవేత్తలకు పురస్కారాలను మధునాపంతుల ఫౌండేషన్ ప్రకటించింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కిరణ్ మధునాపంతుల గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈ పురస్కారాలను తల్లావర్ఘుల పతంజలి శాస్త్రి..మధురాంతకం నరేంద్ర..చిరంజీవి వర్మ అందుకున్నారు. సాహితీ రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన డాక్టర్ రామశాస్త్రి(అనామకుడు)..దాట్ల దేవదానంరాజు..ముక్కామల చక్రధర్‌లకు ఈ ఏడాది మధుశ్రీ పురస్కారాలను అందజేయనున్నట్లు కిరణ్ తెలిపారు. మార్చి 5న పల్లిపాలెంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఆయన అనామకుడు

చెన్నైలో పుట్టి అక్కడి విశ్వవిద్యాలయంలో పీజీ చేయడంతో పాటు ఐఐటీలో డాక్టరేట్ పొందిన రామశాస్త్రి ఈ ఏడాది అవార్డు అందుకోనున్నారు. ఆక్స్‌ఫర్డ్..కెల్లాగ్‌లలో మేనేజ్‌మెంట్ కోర్సులు చదివిన ఈయన మూడు దశాబ్దాలకుపైగా రిజర్వు బ్యాంకులో సేవలందించారు. వృత్తి బ్యాంకింగ్ రంగమైనా ప్రవృత్తి మాత్రం సాహితీ సృజనే. ఆయన రచనలు ఇంగ్లిషు..చైనా భాషల్లో అనువాదమయ్యాయి. రెండు నవలలు, 60 వరకూ కథలూ రచించారు. అందులో 15కుపైగా వివిధ బహుమతులు పొందాయి. ఈయన తన కలం పేరును అనామకుడిగా పెట్టుకున్నారు.

దాట్ల దేవదానం రాజు

మరో పురస్కార గ్రహీత దాట్ల దేవదానం రాజు. ఈయన యానాంను సాహితీ చలివేంద్రంగా మార్చుకున్న గొప్ప రచయిత. కవిత్వం, కథలు, సంకలనాల సంపాదకత్వం, యాత్రా సాహిత్యం, రైతు నేపథ్యంలో రచనలు, గోదావరి ప్రాంత సంగతులు ఈయన ఇతివృత్తాలు.

ముక్కామల చక్రధర్

సాహిత్య రంగానికి సేవలందించిన సీనియర్ జర్నలిస్టు ముక్కామల చక్రధర్. రాశిలో తక్కువయినా వాసిలో గొప్ప కథలు రాశారు. ముక్కామల బుజ్జిగాడుగా ప్రసిద్ధులు. కేరాఫ్ కూచిమంచి అగ్రహారం పేరిట ఆయన ఆవిష్కరణకు ఎంతో గుర్తింపు వచ్చింది. కాలమిస్టుగా ఆయన వ్యాసాలు ఆలోచింపజేస్తాయి.

చదువుల మదింపు వేళ

- ఈ నెల 9 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్
- 1–9 తరగతులకు ఎఫ్ఏ–4 పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో సిద్ధమవుతున్న 7.47 లక్షల మంది



రాయవరం: విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా ఎఫ్ఏ–4 పరీక్షలను ఈ నెల 9నుంచి 14వ తేదీ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు గతేడాది నవంబర్‌లో 1–8 తరగతులకు ఎఫ్ఏ–1, ఎఫ్ఏ–3 పరీక్షలను ప్రయోగాత్మక విధానంలో 'క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్' విధానంలో నిర్వహించగా, ఎఫ్ఏ–2 పాత విధానంలో నిర్వహించారు. ఇప్పుడు నిర్వహించబోయే ఎఫ్ఏ–4 కూడా పాత విధానంలోనే నిర్వహించనున్నారు. 9,10 తరగతుల విద్యార్థులకు మాత్రం గతంలో మాదిరిగానే ఎఫ్ఏ–1 నుంచి ఎఫ్ఏ–4 వరకు ఫార్మేటివ్ విధానంలో పరీక్షను నిర్వహిస్తున్నారు. డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైంది. వచ్చే నెలలో జరగనున్న ఎస్ఏ–2 పరీక్షలు 1–8 తరగతులకు సీబీఏ విధానంలోను, తొమ్మిదో తరగతికి పాత విధానంలో నిర్వహించనున్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు 10వ తరగతికి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

షెడ్యూల్ విడుదల

పాత విధానంలో నిర్వహించే ఎఫ్ఏ–4 పరీక్షలు ఈ నెల 9 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్‌టీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న ఎయిడెడ్ యాజమాన్యంలోని 15,956, ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లో 4,71,958, ప్రైవేటు యాజమాన్యంలో 2,59,838 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

9 నుంచి 20 వరకు టెన్త్ ప్రీ ఫైనల్

పదవ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ ఈ నెల తొమ్మిదవ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి టైమ్ టేబుల్ విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఎఫ్ఏ–4 పరీక్షలు పాత విధానంలోనే జరుగుతాయి. పరీక్షలను ప్రభుత్వ పాఠశాలలతో పాటుగా ప్రైవేట్ పాఠశాలలు కచ్చితంగా నిర్వహించాలి. 1–9 తరగతులకు ఎఫ్ఏ–4 పరీక్షలను నిర్వహిస్తున్నాం. ఎస్‌సీఈఆర్‌టీ ఇచ్చిన టైమ్ టేబుల్ ప్రకారం అన్ని యాజమాన్యాలు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలి.

– ఎం.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి, డీసీఈబీ, కాకినాడ.

పబ్లిక్ పరీక్షల మాదిరిగానే..



పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను పబ్లిక్ పరీక్షలు మాదిరిగానే నిర్వహించాలి. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పరీక్షలను సమర్థంగా నిర్వహించాలి.

– ఎస్.అబ్రహం, డీఈవో, రాజమహేంద్రవరం.

సన్నద్ధం చేయాలి



పబ్లిక్ పరీక్షలకు ప్రీ ఫైనల్ పరీక్షలను ట్రయల్‌రన్‌గా భావించాలి. ఎక్కడా ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పరీక్షలను నిర్వహించాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

ఆన్‌లైన్‌లో పేపర్లు



ఎఫ్ఏ–2 మాదిరిగానే ఎఫ్ఏ–4 పేపర్లు ఆన్‌లైన్‌లో పాఠశాల హెచ్ఎంలకు చేరవేస్తాం. పదవ తరగతి ప్రీ ఫైనల్ పేపర్లు కూడా ఆన్‌లైన్‌లోనే సరఫరా చేస్తాం.

– బి.హనుమంతురావు, డీసీఈబీ కార్యదర్శి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా